

టీటీడీ చీఫ్ పీఆర్వో రవికి శుభాకాంక్షలు



తిరుపతి సిటీ : ప్రపంచ ప్రఖ్యాత ధార్మిక క్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానముల చీఫ్ పీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన డా.టి.రవికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ సభ్యులు బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. 90 ఏళ్ల టీటీడీ చరిత్రలో తొలిసారిగా ఇన్ సర్వీస్‌లో చీఫ్ పీఆర్వోగా ఉద్యోగోన్నతి పొందారని కొనియాడారు. ఉత్తమ ప్రజాసంబంధాల నిర్వహణ ద్వారా శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేయాలని, టీటీడీ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేయాలని ఈ సందర్భంగా కోరారు. పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, మాజీ ఛైర్మన్ డా.స్వరాజ్యలక్ష్మి, కార్యవర్గ సభ్యులు ఆర్సీకె.రాజు పాల్గొన్నారు.



నారావారిపల్లిలో ఏర్పాట్లు

సిఎం ఇంటిని ముట్టడిస్తాం

- 31 అంకెతో వినూత్న నిరసన
- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. గురువారానికి అంగన్వాడీలు చేస్తున్న పోరాటం 31 వ రోజుకు చేరు కుంది. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం దీక్షా శిబిరం ముందు 31 వ రోజుకు చేరుకున్నా తమ సమస్య పరిష్కారం కాలేదని 31వ సంఖ్య రూపంలో అంగన్వాడీలు కూర్చుని నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ మాట్లాడుతూ లక్ష పైచిలుకు కార్మికులు, మహిళలు 31 రోజులుగా పోరాటం చేస్తుంటే ఈ ముఖ్యమంత్రికి పట్టడం లేదంటే దీనికంటే దుర్మార్గం మరొకటి ఉందా అని ప్రశ్నించారు. కిస్మస్, నూతన సంవత్సర వేడుకలు దీక్షా శిబిరంలోనే జరుపుకున్నామని, సిఎం నిర్లక్ష్యం వల్ల భోగి, సంక్రాంతి పండుగలనూ ఇక్కడే జరుపుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర బంద్ చేయడానికే కాదు, సిఎం ఇంటినీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంజావూరు మురళి, అంగన్వాడి నాయకులు నాగరాజమ్మ, గీత, ఎల్లమ్మ, సుజాత, సుజిత, వరలక్ష్మి, వెంకటలక్ష్మి గోమతి, గంగాదేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

- పుత్తూరులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ఎన్ని నోటీసులు ఇచ్చినా సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సమ్మె 31వ రోజుకు చేరుకున సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ విశాఖపట్నంలో జగన్మోహన్‌రెడ్డి భవనం కట్టేదానికి రూ.500 కోట్లు కేటాయించారని, అదే అంగన్‌వాడీల జీతాలు పెంచేందుకు మాత్రం మనస్సు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జీబీఎస్ మణ్యం, యుటిఎప్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్న ఆయుడు, అంగన్‌వాడీలు మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, రాధ, పద్మజ పాల్గొన్నారు.
- నాయుడుపేటలో ఐసిడిఎస్‌కార్యాలయం వద్ద పండగ పూట తమకు వేతనాల్లేవంటూ అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు.

సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ క్రిస్మస్; న్యూ ఇయర్ వేడుకలకు కుటుంబానికి దూరంగా శిబిరంలోనే జరుపుకున్నామని, అలాంటిది సంక్రాంతి పండుగైనా కుటుంబంతో సంతోషంగా జరుపుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్యామలమ్మ, కళావతి, నాగమ్మ, చెంగమ్మ పాల్గొన్నారు.

- గూడూరులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే జగన్మోహన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంగన్‌వాడీల పోరాట పటిమను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రవతి, కార్యదర్శి బివిఎస్ ప్రభావతి, సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్. సురేష్ పాల్గొన్నారు.
- సూళ్లూరుపేటలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్ సంఘీభావం ప్రకటించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.
- కోటలో వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు యుటిఎఫ్ నాయకులు 15వేల రూపాయలు విరాళంగా అందజేశారు. నాయకులు జనార్ధన్, మనోహర్, భాస్కర్‌రావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

సంక్రాంతి సంబరాలకు నారావారిపల్లి ముస్తాబు

రేపు నారా, నందమూరి కుటుంబాలు రాక

ప్రజాశక్తి - రామచంద్రాపురం /చంద్రగిరి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా సంక్రాంతి సంబరాలకు తన స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్న సందర్భంగా పల్లె శరవేగంగా ముస్తాబవుతోంది. నారా కుటుంబంతో పాటు నందమూరి కుటుంబ సభ్యులూ రానున్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను అవలంబిస్తూ భావితరాలకు స్ఫూర్తిని ఇవ్వాలనే ధ్యేయంతో ప్రతి ఏడాదీ నారా చంద్రబాబు నాయుడు తమ కుటుంబ సభ్యులతో స్వగ్రామంలో గడపడం విశేషం. నారావారిపల్లి లోని బాబు ఇంటి ముందర రంగవల్లులతో తీర్చిదిద్దారు. సంక్రాంతి పర్వదినాలలో యువతకు ఆటల పోటీలు నిర్వహించడానికి మైదానం సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలు దగ్గర అవుతుండటంతో ఆశావాహులు, టిడిపి నాయకులు వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున రానుండటంతో పార్కింగ్ స్థలాన్ని టిటిడి కళ్యాణ మండపం పక్కన సిద్ధం చేస్తున్నారు. నారా, నందమూరి కుటుంబాలకు పెద్ద ఎత్తున ఆహ్వానం పలికే విధంగా టిడిపి శ్రేణులు భారీ ఎత్తున నారావారిపల్లి నుండి శ్రీనివాస మంగాపురం వరకు కటౌట్లు/ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనుండటంతో అధికారుల అనుమతికి వినతి పత్రాలు సమర్పించారు. నారా భువనేశ్వరితో



బ్రాహ్మణి నందమూరి కుటుంబ సభ్యులు 12వ తేదీ నారావారిపల్లి చేరుకోనున్నారు. 13వ తారీఖున నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, బాలకష్ణ నారావారిపల్లికి రానున్నారు. రాజకీయాలలో విసిగి వేసారిన నారా లోకేష్ ఉపశమనం కోసం తన మిత్రబందంతో 14న ఉదయం పక్కనే ఉన్న గుట్ట ఎక్కి ట్రెక్కింగ్‌కి వెళ్ళనున్నారు. అదే రోజు సాయంత్రం ఇంటి ఆవరణలో ఫ్లూప్ డ్యాన్స్, భరతనాట్యము జరగనుంది. 14న రంగోలి, ఆటల పోటీలు, డీజే కోలాటాలతో పల్లె పరవళ్లు తొక్కనుంది. ఆట పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నారు. 15వ తారీఖున కుటుంబ సభ్యులతో కలిసి తల్లిదండ్రుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే కులదేవత నాగాలమ్మకు పూజలు నిర్వహించనున్నారు. ఇంటి ఆవరణలో సాంప్రదాయ ఆటలైన గంగిరెద్దు, గొబ్బెమ్మ ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాల అనంతరం 16వ తారీఖున నారా చంద్రబాబునాయుడు, లోకేష్, బాలకష్ణ తిరుగు ప్రయాణం కానున్నారు.



కరపత్రాలను పంచి పెడుతూ చింతామోహన్ ప్రచారం

మున్సిపల్ కార్మికులు విధుల్లోకి..!



చెత్తను తరలించే పనిలో కార్మికులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

రాష్ట్ర కమిటి పిలుపు మేరకు పురపాలక కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమిస్తునట్లు గూడూరు సిఐటియు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ క్లీన్ ఎన్విరాన్మెంటల్ వర్కర్స్ జీతం 2024, జనవరి నుండి 21 వేల రూపాయలు బేసిక్ గా మారుతుంది. దీనికి సంబంధించి ఒక నెల జీతం బోనస్ గా లేదా నెలకు 3000- 2000 అయినా అదనంగా జీతం చెల్లించాలని కోరామని, కానీ ప్రభుత్వం నిరాకరించి సంక్రాంతి కానుకగా వెయ్యి రూపాయలు కార్మికులందరికీ ఇవ్వటానికి సిద్ధమయిందన్నారు. అదేవిదంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శానిటేషన్ డ్రైవర్లకు 2024 జనవరి నుండి 24వేలు బేసిక్ జీతం అందనుంది. రాజధాని ప్రాంతం లోని కార్మికులకు ప్రస్తుతం సిఆర్డిఏ వారు జీతాలు చెల్లిస్తున్నారు. త్వరలో సి ఆర్ డి ఏ అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తెలిపారు. క్లీన్ ఎన్విరాన్మెంటల్ వర్కర్స్ కు సంక్షేమ పథకాలు అమలు చేయటానికి ప్రభుత్వం అంగీకరించిందన్నరు. ఇంజనీరింగ్ విభాగంలోని జీవో ఆర్టీ నంబర్ 30 లో సెమిస్టర్ బదులు జీతాలు పొందుతున్న కార్మికులకు వారం రోజుల్లో ఫైనాన్సు డిపార్ట్మెంట్ ఆమోదం తీసుకొని సెమీస్ కెల్డ్ జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సర్టిఫికెట్స్ లేకుండా సెమీ స్కిల్ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు స్కిల్ డెవలప్మెంట్ వారి ద్వారా కోర్సు డిజైన్ చేసి ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్స్ ఇచ్చిన తర్వాత పనికి తగిన జీతం చెల్లిస్తామని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఇంజనీరింగ్ లో మిగిలినటువంటి స్ట్రీట్ లైటింగ్ మెకానికులు తదితర కేటగిరీలకు చెందిన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఏఎస్ అధికారులతో కూడిన 9 మందితో కమిటీ ఏర్పాటు చేసి వారి నుండి నివేదిక వచ్చిన తర్వాత వీరి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. ఇంజనీరింగ్ , పారిశుద్ధ్య కార్మికులందరికీ పదేళ్ల సర్వీస్ ఉన్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్ కింద 75 వేల రూపాయలు ఇచ్చేందుకు గవర్నమెంట్ అంగీకరించిందన్నారు. కానీ మనం లక్ష రూపాయలు ఇవ్వాలని కోరామన్నారు ఎక్స్గ్రేషియో కి సంబంధించి జనరల్ మరణానికి రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.. దహన సంస్కారాలకు ఇచ్చే ఆర్థిక సహాయం 15 వేల నుండి 20 వేల రూపాయలకు పెంచిందన్నారు. సమ్మె కాలం జీతం చెల్లింపు, పోలీస్ కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో సి. ఐ. టి. యు నాయకులు గోపి, బి.వి.రమణయ్య సురేష్ , అడపాల ప్రసాద్ , చంద్రయ్య , పెంచల్ ప్రసాద్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పరిశుభ్రంగా ఉండాలి : పొనకా దేవసేనమ్మ

సంక్రాంతి పండుగల నేపథ్యంలో గూడూరులో పేరుకు పోయిన చెత్తా చెదారాలను రెండు రోజుల్లో తరలించి పరిశుభ్ర గూడూరుగా తీర్చిదిద్దాలని పారిశుద్ధ్య కార్యదర్శులు, కార్మికులకు స్వచ్ఛ ఆంధ్ర సంస్థ ఛైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించారు. దీంతో గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. బనిగి సాహెబ్ పేట, సాధుపేట తదితర ప్రాంతాల్లో కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి దేవసేనమ్మ దగ్గరుండి పర్యవేక్షించారు.



స్వచ్ఛ సర్వేక్షన్‌లో తిరుపతికి రెండో ర్యాంక్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో తిరుపతి నగరపాలక సంస్థ అవార్డుల మోత మోగించింది. పదిలక్షల జనాభా కలిగిన పట్టణాల్లో రెండవ ర్యాంకు, జాతీయ స్థాయిలో క్లీనెస్ట్ సిటీ గా తిరుపతి నగరపాలక సంస్థ కు జాతీయ స్థాయిలో 8వ ర్యాంక్ సాధించింది. మరోమారు వాటర్ ప్లస్ సిటీ గాను, గార్బేజ్ ఫ్రీ సిటీ గానూ సర్టిఫికేషన్ పొందారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 2023 స్వచ్ఛ సర్వేక్షణ్ ఫంక్షన్ లో కేంద్ర పట్టణాభివద్ధి శాఖ మంత్రి హర్ దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా ఈ అవార్డులను నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష , కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అధికారులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళి శ్వర్ రెడ్డి, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

జగనన్న తోడు రూ.18.21 కోట్లు జమ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చిరు వ్యాపారుల ఆర్థిక స్వావలంబన కోసం, నడ్డి విరిచే వడ్డీలకు చెల్లుచీటీ చెబుతూ గురువారం ఉదయం వరుసగా నాలుగో ఏడాది ఎనిమిదో విడత జగనన్న తోడు రూ.18.21 కోట్లును లబ్దిదారులకు జమ చేసింది. తిరుపతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎంఎల్ఏ ఆదిమూలం, డిఆర్‌డిఏ పీడీ జ్యోతి హాజరయ్యారు. జిల్లాలో 16,541 మందికి రూ.17.50 కోట్ల రుణాలు, రూ.70.71 లక్షలు రీయింబర్స్‌మెంట్ జమ అయ్యిందని తెలిపారు.

'మార్పు' కావాలి : చింతామోహన్

ప్రజాశక్తి - నారాయణవనం/సత్యవేడు/కెవిబిపురం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు పాతర వేయడంతో వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టాయని తిరుపతి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ చింతామోహన్ ఆరోపించారు. గురువారం ఆయన నారాయణవనం, సత్యవేడు, కెవిబిపురం మండలాల్లో 'మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి' కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతామోహన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాలుగా విధ్వంసకర పాలన కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేదన్నారు. తహసిల్దార్ కార్యాలయంలోనూ, జిల్లా కలెక్టరేట్లోనూ ఉండాల్సిన ఓటర్ల జాబితా పోలీస్ స్టేషన్లో ఉండడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తిరుపతి ఉప ఎన్నికల్లోను దొంగ ఓట్లు అధికంగా పడ్డట్టు స్వయాన ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తారు. పేదల భూములు లాక్కోవడానికి ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చీకటి చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి కొనసాగిస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. వేతనాలు పెంచాలంటూ నెల రోజులుగా అంగన్వాడి కార్యకర్తలు ఆందోళన చేపట్టగా అదే బాటలో సర్వ శిక్ష అభియాన్, మున్సిపల్ కార్మికులు తదితరులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురలు తేజోవతి పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్లపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - నాయుడుపేట

మండలంలోని పలు రియల్ ఎస్టేట్ వెంచర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని సిపిఎం బందం చాపల వెంకటేశ్వర్లు, బి.గోపాలయ్య, చేజర్ల చంద్రకళ నాయుడుపేట తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాయుడుపేట మండలంలో పండ్లూరు దగ్గర ఉన్న ఓ ప్రైవేట్ పరిశ్రమ సమీపంలో మామిడి కాలువను సైతం కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వెంచర్ నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్నారని తెలిపారు. ఈ ప్రదేశం ముంపు ప్రభావిత ప్రదేశంలో ఉండడంతో ఈ వెంచర్ లో క్రయవిక్రయాలు జరిపిన వాళ్ళు సైతం మునిగిపోవడం ఖాయమని తెలిపారు. షుగర్ పరిశ్రమ పక్కనున్న వెంచర్ ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు నాయుడుపేట పట్టణంలో పిచ్చిరెడ్డి తోపు లో ఉన్న వెంచర్ కూడా సరైన అనుమతులు లేకుండానే ప్లాట్లు అమ్మేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా అమ్మకాలకు తెర లేపారని అన్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవడంలో సంబంధించిన అధికారులు మౌనవ్రతం ఎందుకు పాటిస్తున్నారని ధ్వజమెత్తారు. రియల్ ఎస్టేట్ మాయగాళ్లు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు సైతం కబ్జా చేసి తప్పుడు సర్వే నెంబర్లు వేసి అమ్మేస్తున్నారని ఆరోపించారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల పర్వం

తిరుపతి టౌన్ : 40 ఏళ్లుగా నిషేధంలో ఉన్న 110 ఎకరాలకు సంబంధించిన భూములను 22(ఏ) జాబితా నుంచి తొలగించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల పర్వం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ మూలపత్రాలలో ఎంఎల్ఏ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గురువారం సాక్షి సంతకం చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవతో తిరుపతిలోని 7,500 కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. ప్రస్తుతం 33వ వార్డులోని 9/2 సచివాలయం పరిధిలోని లబ్దిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఉండేందుకు పత్రాల్లో సాక్షి సంతకం చేసినట్లు అభినయ్‌రెడ్డి తెలిపారు. కార్పొరేటర్ మునిరామిరెడ్డి, అనీష్‌రాయల్ పాల్గొన్నారు.



తిరుపతి రైల్వేస్టేషన్ 133వ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రైల్వే స్టేషన్ మహోత్సవ వేడుకను విశ్రాంతి ఉద్యోగులు, రైల్వే అధికారులతో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ నిర్వహించారు. స్టేషన్ మహోత్సవం సందర్భంగా ప్రత్యేకమైన కేకును స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ కట్ చేసి జన్మదిన వేడుకలకు శ్రీకారం చుట్టారు. కుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ రైల్వే వ్యవస్థ స్థాపన చరిత్ర, తిరుపతి వారసత్వం తెలియజేస్తూ మీటర్-గేజ్ స్టేషన్ గా, రెండు లైన్లు స్టేషన్గా అతి చిన్న స్టేషన్గా 133 సంవత్సరాల క్రితం ప్రారంభమైందన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ 6 ప్లాట్ ఫామ్ లతో నిత్యం 80 వేల మంది ప్రయాణికుల రాకపోకులకు సౌకర్యంగా ఉందని తెలిపారు. తిరుపతి స్టేషన్ పర్యావరణంలో గోల్డ్ రేటింగ్ సాధించినందుకు గర్వంగా ఉందన్నారు తిరుపతి రైల్వే స్టేషన్ను 300 కోట్లతో అభివద్ధి పనులను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. స్టేషన్ మహోత్సవం సందర్భంగా విశ్రాంతి ఉద్యోగులను స్టేషన్ డైరెక్టర్ సన్మానించారు.

పుత్తూరులో సిఐటియు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

ఎంబి రోడ్డులో సిఐటియు కార్యాలయాన్ని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీబిఎస్ మణ్యం, కందారపు మురళి, అంగన్‌వాడీ అధ్యక్షులు విజయకుమారి, కార్యదర్శి మునికుమారి చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభ నాయకులు ఆర్.వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. కందారపు మురళి మాట్లాడుతూ పుత్తూరులో సిఐటియు కార్యాలయానికి రామ్మూర్తిరెడ్డి సొంత భవనాన్ని ఇవ్వడం వల్ల కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్మికులకు ఏ కష్టం వచ్చినా సిఐటియు అండగా ఉంటుందన్నారు. రామ్మూర్తిరెడ్డి మాట్లాడుతూ సిఐటియు చేస్తున్న పోరాటాలను దగ్గరగా చూస్తున్నానని, పేదలకు, కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. తన భవనం పేదల పోరాటానికి ఉపయోగపడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్‌నాయుడు, మునిరత్నం, ఎల్ఐసి యూనియన్ కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్, దస్తగిరి, ఆటో యూనియన్ కార్యదర్శి పురుషోత్తం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




సిఐటియు కార్యాలయానికి భవనాన్ని విరాళంగా ఇచ్చి ప్రసంగిస్తున్న రామ్మూర్తిరెడ్డి

'స్వామి'పై వ్యతిరేకత..

జీడీనెల్లూరులో 'మార్పు' రాజకీయం

'కృపాలక్ష్మి' రాణించేనా..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలే ఈసారి నారాయణస్వామికి టిక్కెట్ ఇవ్వొద్దని గత ఏడాది నుంచి విముఖత చూపుతూనే ఉన్నారు. అదే నియోజకవర్గం తాజాగా పెనుమూరులో నారాయణస్వామి వ్యతిరేకులంతా సమావేశమై 'ఆ కుటుంబానికి టిక్కెట్ ఇవ్వొద్దు' అంటూ ప్లకార్డులతో నిరసన తెలపడమే కాకుండా, అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లారు. నారాయణస్వామికి టిక్కెట్ ఇస్తే ఓడించి తీరుతామన్న అక్కస్సుతో వారు ఉన్నారు. ఈ తరుణంలోనే జగన్ నారాయణస్వామిని తప్పించి, అతని కుమార్తె కృపాలక్ష్మికి టిక్కెట్ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటో మరి. ఈ మార్పు రాజకీయం ఎంతవరకు రాణిస్తుందో. నారాయణస్వామిపై వ్యతిరేకులు కూతురు కృపాలక్ష్మిని కలుపుకుపోతారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

జీడీనెల్లూరు నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. ఒక్కసారి మాత్రం గాంధీ టిడిపి నుంచి ఎంఎల్ఏగా గెలుపొందారు. ఎక్కువసార్లు మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మే ఎంఎల్ఏగా ఉంటూ వచ్చారు. అప్పట్లో వేపంజేరి నియోజకవర్గంగా ఉండేది. రిజర్వేషన్ నియోజకవర్గం కావడంతో అప్పట్లో కాంగ్రెస్‌లో సీనియర్ నేత జ్ఞానేంద్రరెడ్డికి ఆ నియోజకవర్గంలో పోటీచేసే అవకాశం లేకపోవడంతో విజయభాస్కర్‌రెడ్డి సిఎంగా ఉన్న హయాంలో జనరల్ స్థానమైన చిత్తూరు పార్లమెంట్‌కు జ్ఞానేంద్రరెడ్డి రెండుసార్లు ఎంపిగా గెలుపొందారు. ఆ తరువాత రాష్ట్ర విభజన, వైసిపి ఆవిర్భావంతో కాంగ్రెస్ కంచుకోట వైసిపికి కైవసం అయ్యింది. రెండు దఫాలు నారాయణస్వామి అక్కడ ఎంఎల్ఏగా గెలుపొందారు. తొలినుంచి నారాయణస్వామిపై వ్యతిరేకత ఉన్నప్పటికీ జగన్‌ను చూసి ఓట్లేశారన్నది అక్షర సత్యం. కరోనా కాలంలో నియోజకవర్గంలో చేసింది శూన్యం. ఒక్క టమోటా పండు కూడా పంచలేదు. డిప్యూటీ సిఎం అయినప్పటికీ ఒకే గ్రూప్‌కు సపోర్టు చేస్తూ రావడంతో, మరో గ్రూప్ దూరమవుతూ వచ్చింది. తెలివిగా 'పెద్దిరెడ్డి'తో మిత్రత్వం పెంచుకుని ఐదేళ్లపాటు డిప్యూటీ సిఎంగా పనిచేయగలిగారు. తాజాగా అతనిపై ఉన్న వ్యతిరేకత దృష్ట్యా, టిక్కెట్‌ను అతని పెద్ద కుమార్తె కృపాలక్ష్మికి ఇచ్చారు. అయితే జ్ఞానేంద్రరెడ్డి మాత్రం అతని కూతురుకు ఇచ్చినా ఈసారి ఆ కుటుంబాన్ని ఆదరించేది లేదని బహిరంగంగానే వ్యతిరేకత చాటుకున్నారు. ఈ సీటును ఆశించిన గుమ్మడి కుతూ హలమ్మ చెల్లి కొడుకు రాజేష్ సైతం వ్యతి రేకంగానే పని చేసే అవకాశం ఉంది. పాల సముద్రం ఎంపిపి ప్రకాష్ సైతం నారాయణస్వామికి వ్యతిరేకంగానే ఉన్నారు. కళత్తూరు నారాయణస్వామి సొంత మండలం కార్వేటినగరంలో మాత్రమే అంతోఇంతో అనుకూలంగా ఉంది. మిగిలిన పెనుమూరు, ఎస్ఆర్‌పురం, జీడీనెల్లూరు, పాలసముద్రం మండలాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో కృపాలక్ష్మి వీరందరినీ ఎలా కలుపుకుపోతారో వేచి చూడాల్సిందే.



ఫొటోగ్రఫీ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రామచంద్రపురం: చంద్రగిరి యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 17వ తేదీ నుంచి 30వరకు తెల్ల రేషన్ కార్డు కలిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 19నుంచి45ఏళ్ల వయస్సు ఉన్న వాళ్లకి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన స్త్రీ, పురుషులకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 7989680587, 9494 951289 6301717672 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యాబోధనలో

అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు : వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాలను వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో శాఖలో కొందరు ఆచార్యులు లేకపోవడాన్ని గుర్తించారు. సంబంధిత శాఖాధిపతులకు వివరణ కోరుతూ నోటీసులు పంపారు. విద్యా బోధనలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

చంద్రగిరిలో కల్యాణమండపం నిర్మించాలి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: చంద్రగిరిలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలని తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డికి డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని పోస్టు ద్వారా పంపినట్లు చంద్రగిరి వాసులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం చంద్రగిరి వాసులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పాలనలో నిర్మించబడిన రామాలయంకు ఆనుకొని రెండు ఎకరాలకు పైగా స్థలం ఉందని చెప్పారు. ఆ స్థలం ఎంతో విలువైనదని, ఆ స్థలంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం చేపడితే నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శ్రీకృష్ణదేవరాయలు వెంకటేశ్వరస్వామి వారి భక్తుడు కావటం మూలాన చంద్రగిరిలో టీటీడీ కోదండ రామస్వామి ఆలయాన్ని తన పరిధిలోనికి తీసుకొని అభివృద్ధి చేస్తున్నదన్నారు. ఇక్కడ కల్యాణ మండపం నిర్మాణం చేపడితే విలువైన స్థలాన్ని కాపాడినట్లు పేద ప్రజలకు వివాహాలు చేసుకోవడానికి చేయూతనిచ్చినట్లు అవుతుందన్నారు. జరగబోవు టీటీడీ బోర్డు సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదనలు చేసి కల్యాణ మండపాన్ని మంజూరు చేయించాలని కోరారు.

పాడి రైతులు అప్రమత్తత వహించాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: తీవ్ర మంచు ప్రభావంతో పాడి పశువులు అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పశువైద్యాధికారి డాక్టర్ సుధీర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని జయంపు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 190గొర్రెలు, మేకలు, 42గేదెలకు, 35దూడలుకు నట్టల నివారణ మందులు పంపిణి చేసి గొర్రెలకు నోటి పుండ్లు, నీలి నాలుక, జనరల్ పరిక్షలు నిర్వహించారు. పాడి రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పంటలు, పశువులకు సంబంధించి టోల్‌ఫ్రీ నెం. 18004198800కు సంప్రదించి సూచనలు, సలహాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ సపోర్టర్ వెంకటరమణ, ఏహెచ్‌ఏ వెంగళరావు, రైతులు పాల్గొన్నారు.

అందరికీ బీమా అందించడమే టాటా ఏఐఏ లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అందరికీ బీమా అందించాలని లక్ష్యంతో టాటా ఏఐఏ పనిచేస్తుందని ఆ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గిరీష్ కల్రా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా' 2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యంకు మద్దతుగా, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ (టాటా ఏఐఏ) ముందుకెళ్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలు బీమాపై అవగాహన కల్పిస్తూ, చొచ్చుకుపోవడానికి అనేక కార్యకలాపాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యకలాపాలలో కంపెనీ శాఖలు, భాగస్వామ్య శాఖలలో ఆన్-గ్రౌండ్ ఈవెంట్‌లు, పౌరులతో ఫోకస్ గ్రూప్ డిస్కషన్‌లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు, రెగ్యులేటర్‌లు, పరిశ్రమ సహచరులతో సమన్వయంతో ప్రత్యేక అవగాహన డ్రైవ్‌లు ఉన్నాయన్నారు. ఈ కంపెనీ జీవిత బీమా ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచేందుకు కార్యక్రమాలను నిర్వహించటంతో పాటుగా ఆరోగ్య పరీక్షా శిబిరాలు, ఇతర అనుసంధానిత కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజలు వీటిపై అవగాహన పెంచుకొని బీమా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పింఛన్ అందజేత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పివి కండ్రిగ పంచాయతీలో గ్రామ సర్పంచి యనమల కోటమ్మ, ఎంపీటీసీ వరలక్ష్మి ఆధ్వర్యంలో పెంచిన రూ.3వేల పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ పాల్, రాజయ్య, పుతేరి దర్మయ్య, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌ఎంటీలకు అవగాహన

ప్రజాశక్తి-కోట: మండల పరిధిలోని సీఆర్‌ఎంటీలకు గురువారం ఎంఈవోలు శైలజ, మస్తానయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈవో శైలజ మాట్లాడుతూ సీఆర్‌ఎంటీలకు డిసెంబర్ 16 నుండి 19వరకు పెన్‌డౌన్ ఉండడం జరిగిందని, అదే విధంగా 20 నుండి పదో తేదీ వరకు సమ్మెలో కొనసాగించారని తెలిపారు. ఎస్ఎస్ఏలు సీఆర్‌ఎంటీలు విధులకు హాజరయ్యారని తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



కళాశాల ప్రాంగణంలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు



సంప్రదాయ దుస్తులతో సందడి చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

- సెవెన్ హిల్స్ ఫార్మసీలో సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు, అధ్యాపకుల సందడి
- పుత్తూరులో ఆకట్టుకున్న రంగవల్లులు
- గోకులాపురంలో జోరుగా జల్లికట్టు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: సెవెన్ హిల్స్ ఫార్మసీలో సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు సందడి చేశారు. సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలి రోజు భోగి సందర్భంగా భోగి మంటలు, హరిదాసులు, గంగిరెద్దులు, కోయ దొరలు, ఎరుకల సానులు రావడం వంటి ఘట్టాలను విద్యార్థులు చక్కగా ప్రదర్శించారు. బాలికలు గొబ్బెమ్మలు నెలకొల్పి పాటలు ఆలపించారు. రెండవ పండగ సంక్రాంతి గురించి కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి శుభదినం అని సంక్రాంతి నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుందని వివరించారు. మూడవ రోజు పశువుల పండుగని పశువులను చక్కగా అలంకరించి గో పూజలు, పశువుల పండుగలను నిర్వహిస్తారని, నాలుగవ రోజు ముక్కనుమలో చేపట్టబోయే విశిష్ట సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజెప్పారు. అనంతరం ప్రసాదాలు వండి నైవేద్యాలు పెట్టారు పిల్లలందరికీ పంచి పెట్టారు. కళాశాల ఆవరణంలో ముందస్తు సంక్రాంతి సంబరాలతో కోలాహలంగా మారింది. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.

పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాళాశాలలో..

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందమైన రంగవల్లులు, పూలతో అలంకరించిన గొబ్బెమ్మలతో కళాశాలను అలంకరించారు. గొబ్బి పాటలు పాడుతూ భోగి మంటల చుట్టూ ముత్యాలు చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరయ్య, వీరయ్య, నరసింహులు, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, డాక్టర్ కందేరి శ్రీదేవి, పి.వారిబాబు, డాగి దేవకి తదితరులు పాల్గొన్నారు.

గోకులాపురంలో జల్లికట్టు..

- వెయ్యి మందికి అన్నదానం
- ప్రశాంతంగా ముగిసిన జల్లికట్టు



ప్రజాశక్తి-రామచంద్రపురం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని గోకులాపురం గ్రామంలో జల్లికట్టు వైభవంగా జరిగింది. గురువారం పరుష పందేల కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ మండలాల నుండి కోడెగిత్తలను, పశువుల గుంపులను తీసుకొచ్చి దొడ్డెలో బంధించారు. అనంతరం పశువుల కుమ్మలకు రంగులు పూసి, చెక్కలతో తయారు చేసిన పలకలను, నగదు, ఖరీదైన వస్త్రాలను కొమ్ములకు కట్టారు. పశువులు గుంపులను, కోడిగిత్తలను డప్పులు వాయిస్తూ, బాణాసంచాలో పేల్చి ఉరకలు పట్టించారు. జల్లికట్టులో పశువులను కోడిగెత్తులను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపించారు.

ఘనంగా ఎడిఫై 12వ వార్షికోత్సవం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఎడిఫై స్కూల్ 12వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుచానూరులోని ఆ స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇన్కమ్ టాక్స్ జాయింట్ కమిషనర్ వంశీధర్, చాణిక్య ఫోరం ఎడిటర్ ఇన్ చీఫ్, మేజర్ గురువార్య జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాలను రాణించాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత చక్రాలకు చేరుకోవచ్చు అన్నారు. విద్యార్థుల్లో ఒక లక్ష్యాన్ని ఎంచుకున్న లక్ష్యం వైపు ముందుకెళ్లాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా ఇంజనీర్లు డాక్టర్లు ఇతర ఇతర రంగాల్లో రాణించవచ్చని తెలిపారు. విద్యార్థులు రెస్పాన్సిబుల్గా, డిసిప్లిన్ హార్డ్ వర్క్ తో ముందుకెళ్లతో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ 11 సంవత్సరాలు క్రితం ఏర్పాటు చేస్తున్న మా స్కూలు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ రాయలసీమలో ఉన్న నెంబర్ వన్ స్కూల్ గా ఎదిగింది అన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ స్కూల్లో ఇది కూడా ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు. బొమ్మ ఉపాధ్యాయ బృందం బాధ్యతగా వ్యవహరిస్తూ విద్యార్థులు చదువులతో పాటు ఇతర రంగాల్లో కూడా రాణించేలా తర్ఫీదు ఇస్తూ వారి ఉన్నతకి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మా విద్యార్థులను ప్రతిభవంతులకు తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. తమకు సహకరిస్తున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలు పోటీలలో గెలుపొందిన విజేతాలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థిని ఏర్పాటు చేసిన పలు సాంస్కృత కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, సులోచన, సంధ్యా, కీర్తి ప్రియా, జాహ్నవి, దేవరాజులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-నారాయణవనం మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలు జోరుగా సాగుతున్నాయి. గురువారం ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను స్థానిక బాలికల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించారు. మండల స్థాయి ఖోఖో పోటీల్లో పాలమంగళం సచివాలయ పురుషుల జట్టు ఫైనల్ పోరులో విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. అదేవిధంగా బ్యాడ్మింటన్ పురుషుల పోటీలలో నారాయణవనం-3 సచివాలయం పాలమంగళం సచివాలయంపై 2-0 (స్కోరు) తేడాతో విజయం సాధించి నియోజకవర్గస్థాయికి ఎంపిక అయ్యారు. మహిళల బ్యాట్మెంటన్ పోటీలలో అరణ్యం కండ్రిగ జట్టు తుంబూరు సచివాలయంపై 2-0 (స్కోరు) తేడాతో విజయం సాధించారు. ఈ పోటీల పర్యవేక్షణకు ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో శేఖర్, మండల కోఆర్డినేటర్ జయప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశులు, జయప్రద, సదాశివం, రాజా, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీటీఐ వెంకటేశ్వరరావుకు రైల్వే సేవ పురస్కార్ అవార్డు

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట రైల్వేలో స్లీపర్ డిపో సీటీఐ ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటేశ్వరరావు రైల్వే సేవ పురస్కార్ అవార్డును అందుకున్నారు. రైల్వేలో ఉత్తమ విధులు నిర్వహించినందుకు సీటీఐ ఇన్‌ఛార్జ్‌కు గుంతకల్లు డిఆర్‌ఎం మనీష్ అగర్వాల్ చేతుల మీదుగా గురువారం విశిష్టమైన రైల్వే సేవ పురస్కారం అవార్డు అందుకున్నారు. గుంతకల్ డిఆర్‌ఎం ఆఫీస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని అవార్డు గ్రహీత ఎస్.వెంకటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు : డీఎస్పీ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ప్రజాశక్తి-పాకాల: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రత్యేక పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించనున్నట్లు డీఎస్పీ యశ్వంత్ పేర్కొన్నారు. గురువారం ఆయన పాకాల మండలంలోని 53పోలింగ్ కేంద్రాలను సీఐ ఓబులేశుతో కలిసి పరిశీలించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన పాకాల స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లతో పటిష్టంగా నిర్వహించేందుకు అన్నివిధాల చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని పంచాయతీలకు సంబంధించి రౌడీ షీటర్లు, అల్లరి మూకలను ముందస్తుగానే బైండోవర్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట సీఐతో పాటు ఎస్ఐ రామకృష్ణ, హెడ్ కానిస్టబుల్ సోమశేఖర్, సౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ భవనం పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పుత్తూరులోని వాకర్స్ భవనాన్ని గురువారం వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలను ఇంటర్నేషనల్ కార్యాలయానికి పంపితే ఆ మేరకు అవార్డులు, రివార్డులను అందిస్తామన్నారు. పుత్తూరు అసోసియేషన్ క్రమం తప్పకుండా నిర్వహించే కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నా కేంద్రానికి పంపడం లేదని చెప్పారు. అనంతరం అసోసియేషన్ పనితీరుకు సంతృప్తి చెంది రూ.పది వేలు వ్యక్తిగతంగా ఇస్తున్నానని ప్రకటించారు. అలాగే వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల నిర్వహణ తీరుకు స్పందించి కేంద్ర అసోసియేషన్ తగిన ప్రోత్సాహాన్ని అందజేయనున్నట్లు కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ప్రకటించారు. అనంతరం ఇంటర్నేషనల్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, గవర్నర్ మాధవనాయుడు, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు కోనేటి రవిరాజు, అధ్యక్ష కార్యదర్శులు కేఎల్ఎన్ మూర్తి, మునికృష్ణయ్యలు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-క్యాంపస్: విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ ఇంటర్ యూనివర్సిటీ యువజన ఉత్సవాలలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులు ప్రతిభను చాటి బహుమతులు గెలుపొందారు. జనవరి 5 నుంచి 9 వరకు ఆంధ్ర యూనివర్సిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తము ఆరు బహుమతులను కైవసం చేసుకున్నారు. ఇందులో రంగోలిలో కుమారి హేమలత, మెహందీలో కుమారి జ్యోత్స్న ద్వితీయ బహుమతులను సాధించగా, లైట్ ఓకల్ విభాగంలో కుమారి సుష్మ మూడవ బహుమతిని, డిబేట్లో కుమారి ప్రగతి జైస్వాల్ కుమారి యమునశ్రీ తృతీయ బహుమతులను సాధించారు. వర్సిటీ ప్రదర్శించిన కల్చర్ ర్యాలీకి మూడవ బహుమతి వచ్చినట్లు అధ్యాపకులు తెలిపారు. విజేతలు మార్చి 27 నుంచి 1వ తేదీ వరకు లూధియానాలో జరిగే నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని కల్చరల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి తెలిపారు. విజేతలను వీసీ భారతి, రిజిస్ట్రర్ రజిని అభినందించారు.

స్కిమ్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక స్కిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, స్కిమ్స్ అధినేత మిద్దెల హరి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. సీనియర్లు క్రమశిక్షణతో ఉంటూ జూనియర్లకు బాసటగా నిలవాలనీ, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రఘురామరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి, డిఎడ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-కోట: కోడిపందేలు ఆడుతున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. గురువారం ఆయన వివరాలను వెల్లడిస్తూ.. మండలంలోని కర్లపూడి సమీపంలో దాడులు నిర్వహించామన్నారు. పందేలు ఆడుతున్న ముగ్గురుని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.3100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కోడి, పందేలు, జూదం తదితర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకట నరసింహులు హెచ్చరించారు. గురువారం ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. కాదని చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. అసాంఘీక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రజలకు పోలీసులకు సహకరించాలని కోరారు. 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాయలసీమ బలిజ మహాసభ తరపున ప్రచురించిన నూతన క్యాలెండర్‌ను స్థానిక రాధా-రంగా మిత్ర మండలి సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి కాపు సంక్షేమ సేన నేతలు కుంటిపూడి రాజశేఖర్, వేణుగోపాల్‌నాయుడు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సిద్ధులుగారి ప్రసాద్, సుబ్బారావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతన భూ హక్కు చట్టంతో ప్రజా ఆస్తులకు ఎసరు

- ఒక్క ఛాన్స్‌తో వచ్చి అన్ని విధాల ఇబ్బందులే..
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కొత్త భూ హక్కు చట్టాన్ని తీసుకొచ్చి వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులకు ఎసరు పెట్టిందని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలుకొని దొంగ ఓట్ల సూత్రాలతో అడ్డదారుల్లో అధికారంలోకి రావలని చూస్తోందని మండిపడ్డారు. ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల్లో విద్యార్హత లేని వాళ్ళు ఓటు వేయడానికి సహకరించిన అధికారులను సస్పెండ్ చేస్తూ పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారి అధికారిక లాగిన్‌ను ప్రస్తుత తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఆనాడే అందినట్టు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో యథేచ్ఛగా దొంగ ఓట్లను నమోదు చేశారన్నారు. ప్రజాభీష్టంతో ఎన్నికలలో గెలుపొందాలే తప్ప ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ, దొంగ ఓట్లతో అడ్డదారుల్లో అధికారం చేపట్టే సంస్కృతికి వైసీపీ పాల్పడుతోందని నిప్పులు చెరిగారు. ఒకఛాన్స్ అంటూ అధికారాన్ని చేపట్టి ప్రజలను, ప్రతిపక్షాలను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి మద్దతు తెలపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, దంపూర్ భాస్కర్‌యాదవ్, ఆర్‌సి మునికృష్ణ, మునిశేఖర్ రాయల్, కంకణాల రజనీకాంత్, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, ఆముదాల తులసీదాస్, తేజ, ప్రతాప్, మునిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీని ఆదరించండి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో టీడీపీని, బొజ్జల కుటుంబాన్ని ఆదరించాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితా రెడ్డి పిలుపునిచ్చారు. 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 18వ వార్డులో ఆమె పర్యటించారు. నియోజకవర్గంలో అధికార పార్టీ అరాచకాలు ఎక్కువైపోయాయని, బొజ్జలను గెలిపిస్తేనే శాంతి భద్రతలు తిరిగి నెలకొంటాయని సూచించారు. నెమల్లూరు బుజ్జి, నివేదిత మోరే తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే గ్రామాభివృద్ధి'



ఇంటింటి ప్రచారంలో గాలి భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం ఆయన వడమాలపేట మండలం ఎస్వీపురం పంచాయతీలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాన వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి హేమావతి, చిత్తూరు పార్లమెంటరీ మహిళా నాయకురాలు లక్ష్మీ ప్రసన్న, ధనుంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ఇబ్బందులే.!

- మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గూడూరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ హయాంలో నియోజకవర్గంలోని పంబలేరు బ్రిడ్జి, విద్యానగర్ వరకు నాలుగు రోడ్ల రహదారితో పాటు పలు అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి అధికారం ఇవ్వాలని విజ్ఞప్తించారు. సమావేశంలో నాయకులు బిల్లు చెంచురామయ్య, రహిం, శేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: సమిష్టి కృషితో టీడీపీ విజయం సాధించవచ్చని ఆ పార్టీ చెన్నై ఫోరం ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌ఛార్జ్ హెలెన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేయడానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, వాసు, విజయ్ కుమార్, అరుల్ ప్రకాష్, రవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే వెలగపల్లి

ప్రజాశక్తి-గూడూరుటౌన్: విజయవాడలో 125అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరించిన సందర్భంగా ఈ నెల 19న సభ ఏర్పాటు చేసినట్లు గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ సభకు ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. అందుకు సంబంధించి గురువారం మీడియా సమావేశం నిర్వహించి ప్రజలకు పిలుపునిచ్చారు. సభకు వెళ్లేందుకు ప్రతి ఆరు సచివాలయాలకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా వివరించారు. సమావేశంలో మన్యం శ్రీనివాసులు, నరసయ్య, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరణ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సచివాలయ పరిధిలో సర్పంచ్ మేకలత్తూరు లలితాకరుణాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి సంతాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి ఘన స్వాగతం



ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలం లోని మర్రి మంద గ్రామంలో గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధు సుదన రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గున్నేరు కిషోర్‌రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, బత్తి శెట్టి, శ్రీను యాదవ్, జనార్ధన్ యాదవ్, శివయ్య, అర్జున్ బాబు, పరవాలా చంద్ర, మునిరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా అవసరాలు, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, వైస్ ఎంపిపి సుజాత, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్, సర్పంచ్ నగేష్, తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షులు రసూల్ పాల్గొన్నారు.

'గూడూరులో పారిశుద్ధ్యం మెరుగుపడాలి'



పారిశుద్ధ్యం పనులు పరిశీలిస్తున్న దేవసానమ్మ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరులో పేరుకు పోయిన చెత్తా చెదారాలను మరో రెండు రోజుల్లో తరలించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛ ఆంధ్ర సంస్థ ఛైర్మన్ పొనకా దేవసేనమ్మ సూచించారు. గురువారం గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో చెత్త తొలగించాలని సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత

ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: మండలంలోని విశ్వనాథపురం ఎస్టీ కాలనీలో ఈగ రాజేశ్వరమ్మ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.పదివేలను అందజేశారు. ఈగ రాజేశ్వరమ్మ మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులకు వైసిపి నాయకుడు సదానంద రెడ్డి చేతుల మీదుగా మట్టి ఖర్చులు గాను ఆర్థిక సహాయం అందించారు.